సాక్షి నిజామాబాద్

శుక్రవారం । 15 । మార్చి । 2024



బీజేపీతోనే అభివృద్ధి
బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు.
- IIలో ▸





వాతావరణం
ఉదయం ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరగవచ్చు, మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

వన్యప్రాణుల సంరక్షణపై శిక్షణ

డొంకేశ్వర్(ఆర్మూర్): వన్యప్రాణులకు నెలవుగా మారిన ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ ప్రాంతానికి శుక్రవారం ఫారెస్టు అధికారులు రానున్నారు. డొంకేశ్వర్ మండలం చిన్నయానం, జీజీ నడ్కుడ, గాదేపల్లి ప్రాంతాల్లో పర్యటించనున్నారు. ఉదయం 6 గంటలకే డీఎఫ్‌వో నుంచి మొదలుకుని సెక్షన్, బీట్ ఆఫీసర్ వరకు జిల్లా మొత్తం సిబ్బంది గోదావరి తీరానికి చేరుకుని వన్య ప్రాణులను, అక్కడి ప్రకృతిని తిలకిస్తారు. అనంతరం అక్కడే అడవులు, వన్య ప్రాణుల సంరక్షణపై సిబ్బందికి ఉన్నతాధికారులు శిక్షణ ఇస్తారు. అలాగే ఎకోటూరిజం ఏర్పాటుకు సంధించిన అంశాలపై చర్చించనున్నారు.

నేటి నుంచి ఒంటిపూట బడులు

నిజామాబాద్‌అర్బన్: జిల్లాలోని అన్ని పాఠశాలల్లో గురువారం నుంచి ఒంటిపూట తరగతులు ప్రారంభిస్తున్నట్లు డీఈవో దుర్గాప్రసాద్ తెలిపారు. ఉదయం 7.55 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు తరగతులు కొనసాగనున్నాయి.

గాలికుంటు టీకాలు..

డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లా వ్యాప్తంగా శుక్రవారం నుంచి నెల పాటు పశువులకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్లు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి జగన్నాథచారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో సుమారు 2.77 లక్షలల పశువులు ఉన్నాయని, ఆవులు, లేగలు, దూడలు, గేదెలు, గొర్రెలు, మేకలకు ఈ టీకాలను వేయించాలని రైతులకు సూచించారు. జిల్లాకు కావాల్సిన టీకాలు, సిరంజీలు అన్ని మండల పశువైద్య కార్యాలయాలకు పంపించినట్లు తెలిపారు.

డీఎస్సీ సమస్యల పరిష్కారానికి కమిటీ

నిజామాబాద్ అర్బన్: డీఎస్సీ నిర్వహణకు సంబంధించి ఎలాంటి సలహాలు, సందేహాలు ఉన్నా పరిష్కారానికి ప్రత్యేక కమిటీని నియమించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఐదుగురు సభ్యుల కమిటీ అందుబాటులో ఉంటుందన్నారు. కమిటీలో మధుసూదన్(హెచ్‌ఎం) 9440863060, శంకర్(సూపరింటెండెంట్ డీఈవో ఆఫీసు) 9493021910, గోలి ప్రకాశ్(స్కూల్ అసిస్టెంట్, మోర్తాడ్) 9491314539, అనంత్‌రెడ్డి (స్కూల్ అసిస్టెంట్, శాటాపూర్) 9491314613, దీపక్ కుమార్(సీనియర్ అసిస్టెంట్, డీఈవో ఆఫీసు) 9948091295 ఉన్నారని వివరించారు.

మూల్యాంకన విధుల్లో పాల్గొనకపోతే చర్యలు

నిజామాబాద్‌అర్బన్: నిజామాబాద్‌లోని మూల్యాంకన కేంద్రంలో ఇంటర్ జవాబు పత్రాల మూల్యాంకనం ప్రారంభమైందని జిల్లా ఇంటర్మీడియట్ మూల్యాంకన కేంద్రం క్యాంపు అధికారి రవికుమార్ తెలిపారు. ఇదివరకే సంస్కృతం పేపర్ల వాల్యుయేషన్ ప్రారంభమైందని తెలిపారు. శనివారం నుంచి తెలుగు, హిందీ, ఇంగ్లిష్, గణితం, పౌరశాస్త్రం సబ్జెక్టుల మూల్యాంకనం ప్రారంభం కానుందని వివరించారు. మూల్యాంకన విధులకు అధ్యాపకులను రిలీవ్ చేయని ప్రిన్సిపాల్‌లపై, రిలీవ్ చేసినా విధులకు హాజరు కాని అధ్యాపకులపై శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

హైవేపై లారీ దగ్ధం



డిచ్‌పల్లి: నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని మెంట్రాజ్‌పల్లి శివారులో 44 వ నెంబరు జాతీయ రహదారిపై గురువారం రాత్రి ప్రమాదవశాత్తు డీజిల్ ట్యాంకు పేలి లోడ్‌తో వెళుతున్న లారీ దగ్ధం అయింది. భారీ యంత్రాల బెల్టుల లోడ్‌తో తమిళనాడు నుంచి మహారాష్ట్ర రాయచూర్ వెళుతున్న లారీలో అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో డ్రైవర్ వెంటనే లారీని రోడ్డు పక్కకు తీసుకుని నిలిపివేశాడు. సమాచారం అందుకున్న పోలీసులు, ఫైరింజన్ ఘటనా స్థలానికి చేరుకునే లోపే లారీ మొత్తం మంటల్లో కాలిపోయింది. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని డిచ్‌పల్లి ఎస్సై మహేష్ తెలిపారు. ఈఘటనతో రహదారిపై కొద్దిసేపు వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్ జాం ఏర్పడింది. పోలీసులు వాహన రాకపోకలను క్రమబద్ధీకరించారు.

బైపాస్‌తో బతుకు ఛిద్రం



■ మోర్తాడ్‌కు చెందిన రైతు భావాల సంతోష్ తనకున్న ఒకటిన్నర ఎకరం భూమిని జాతీయ రహదారి బైపాస్ రోడ్డు నిర్మాణంలో కోల్పోతున్నాడు. ఇప్పటికే వరద కాలువ కోసం 4.20 ఎకరాలు, రైల్వే లైన్ కోసం 3.20 ఎకరాల భూమిని నష్టపోయాడు. బైపాస్ రోడ్డు కోసం చేపడుతున్న భూసేకరణతో.. సంతోష్ వ్యవసాయం చేయాలంటే గుంట భూమి కూడా లేకుండా పోతోంది.



జాతీయ రహదారి బైపాస్ రోడ్డు కోసం సేకరించనున్న వ్యవసాయ భూమి ఇదే

జాతీయ రహదారి 63



■ మోర్తాడ్‌కు చెందిన రైతు దడివె గంగాధర్ ఇప్పటికే వరద కాలువ కోసం 1.20 ఎకరాల భూమిని ప్రభుత్వానికి అప్పగించాడు. మిగిలిన 30 గుంటల భూమిలోనే మొక్కజొన్న, సజ్జలు, సోయా పంటలను సాగు చేస్తూ జీవనం గడుపుతున్నాడు. ప్రస్తుతం బైపాస్ రోడ్డు నిర్మాణంలో భాగంగా గంగాధర్‌కు మిగిలిన భూమి కూడా పోనుంది.



మోర్తాడ్, గాండ్లపేట్, అంక్సాపూర్ రైతులు విలువైన భూములను కోల్పోతున్నారు. భూమికి ప్రభుత్వం ఇచ్చే పరిహారం తక్కువగా ఉంటోంది. వ్యవసాయ భూములను కొనుగోలు చేయాలంటే ఇప్పుడు ఉన్న ధరలతో సాధ్యం కాదు. ప్రభుత్వం భూమికి బదులు మరో చోట భూమిని కేటాయించాలి. – దడివె ప్రభుదాస్, రైతు, మోర్తాడ్

- 63వ జాతీయ రహదారి విస్తరణలో నిర్మించనున్న రోడ్డు
- భూ సేకరణలో 30.154 హెక్టార్ల భూములు కోల్పోనున్న మోర్తాడ్, గాండ్లపేట్ రైతులు
- వరద కాలువ, రైల్వే లైన్‌ల నిర్మాణం కోసం ఇప్పటికే 185 ఎకరాలకు నష్టం
- వ్యవసాయాన్ని వదులుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని కర్షకుల ఆవేదన

మోర్తాడ్(బాల్కొండ): వరద కాలువ, రైల్వేలైన్ నిర్మాణం వల్ల ఇప్పటికే పెద్ద మొత్తంలో భూములు కోల్పోయిన రైతులు.. ఇప్పుడు 63వ నంబర్ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా నిర్మిస్తున్న బైపాస్‌ల వల్ల పూర్తిగా భూములను కోల్పోయి రోడ్డున పడాల్సివస్తోంది. సాగుకు దూరమై తామెలా బతకాలని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో మోర్తాడ్, గాండ్లపేట్, అంక్సాపూర్ రైతులు బైపాస్ రోడ్డు నిర్మాణాన్ని వ్యతిరేకిస్తున్నారు.

■ వరద కాలువ, రైల్వే లైన్‌ల నిర్మాణం వల్ల మోర్తాడ్, గాండ్లపేట్ గ్రామాల రైతులు 185 ఎకరాల భూమిని కోల్పోయారు. ఇప్పుడు జాతీయ రహదారి విస్తరణలో భాగంగా బైపాస్ రోడ్డు కోసం 30.154 హెక్టార్ల భూమిని సేకరించాలని ఎన్‌హెచ్ఏఐ అధికారులు నిర్ధారించారు. సేకరించాల్సిన భూమికి సంబంధించిన సర్వేను పూర్తి చేయడంతో పాటు గెజిట్ నోటిఫికేషన్‌ను జారీ చేశారు.

అంక్సాపూర్ రైతులదీ ఇదే పరిస్థితి..

వేల్పూర్ మండలం అంక్సాపూర్ రైతులు సైతం ఎంతో విలువైన భూములను వరద కాలువ, రైల్వే లైన్‌లో నష్టపోయారు. ఈ గ్రామానికి చెందిన రైతులు ఇప్పటి వరకు 154 ఎకరాల వరకు కోల్పోగా బైపాస్ రోడ్డు వల్ల మరో 10.954 హెక్టార్ల భూములకు నష్టం వాటిల్లనుంది.

విలువైన భూములు.. పరిహారం అంతంతే...

63వ నంబర్ జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న చోట ఎకరం విస్తీర్ణం ధర మార్కెట్ విలువ ప్రకారం రూ.75 లక్షల నుంచి రూ. కోటి వరకు పలుకుతుంది. జాతీయ రహదారికి కొంత లోపలికి ఉన్న భూములకు రూ.40 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు ధర ఉంది. ప్రభుత్వం ఇచ్చే పరిహారం విలువ మాత్రం అంతంతే ఉంటుంది.

రైతులు నష్టపోయారు..

వరద కాలువ, రైల్వే లైన్‌ల కోసం సేకరించిన భూమికి ఇచ్చిన పరిహారం నామమాత్రంగా ఉండటంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. అప్పట్లో ఎకరం ధర రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ఉంటే రూ.1.45 లక్షల నుంచి రూ.3.24 లక్షల వరకే చెల్లించారు. రెండు పంటలు పండే భూమికి ఒక రకమైన ధర, సాగుకు యోగ్యంగా లేని భూమికి నామమాత్రపు ధరను నిర్ణయించారు. వరద కా లువ, రైల్వే లైన్ నిర్మాణం కోసం తాము ధారదత్తం చేసిన భూమికి ఇచ్చిన పరిహారంతో గుంట స్థలం కూడా కొనలేకపోయామని రైతులు వాపోతున్నారు.



బైపాస్ రోడ్డు నిర్మించవద్దని ఆందోళన చేస్తున్న మోర్తాడ్ రైతులు(ఫైల్)

పరిహారం ఎక్కువ ఇవ్వడానికి కృషి

బైపాస్ రోడ్డు నిర్మాణానికి సేకరించే భూమికి పరిహారం ఎక్కువ ఇవ్వడానికి అధికారులు కృషి చేస్తారు. గతంలో మాదిరిగా కాకుండా మార్కెట్ విలువలను పరిగణనలోకి తీసుకుని భూమికి పరిహారం ఆశించిన విధంగానే అందించడానికి ప్రభుత్వానికి నివేదిక అందిస్తాం. రైతులకు ఆర్థికంగా నష్టం జరుగకుండా చూస్తాం.
– సత్యనారాయణ, తహసీల్దార్, మోర్తాడ్

పసుపు క్వింటాలు రూ. 20,500



సుభాష్‌నగర్/వేల్పూర్: మహారాష్ట్రలోని సాంగ్లీమార్కెట్‌లో పసుపునకు రికార్డు ధర పలికింది. వేల్పూర్ మండలం అంక్సాపూర్ గ్రామానికి చెందిన రైతు మల్లయ్య 23 క్వింటాళ్ల పసుపు తీసుకెళ్లగా గురువారం క్వింటాలుకు రూ.20,500 ధర దక్కింది. 8 ఎకరాల్లో పసుపు పంట సాగు చేశానని, ఇప్పటికే ఈ సీజన్‌లో మూడు దఫాలుగా సాంగ్లీ మార్కెట్‌లో విక్రయించానని తెలిపారు. గడ్కోల్ శ్రీనివాస్ అనే రైతు 20 క్వింటాళ్లు తీసుకెళ్లగా క్వింటాలుకు రూ.20,150 ధర లభించింది. అంతర్జాతీయంగా ఉన్న డిమాండ్‌తో మహారాష్ట్రలోని సాంగ్లీ మార్కెట్‌తోపాటు నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో పసుపు పంటకు మంచి ధర పలుకుతోంది. నిజామాబాద్‌లో ఇటీవల రికార్డు స్థాయిలో క్వింటాలుకు రూ.18,299 ధర పలికిన విషయం తెలిసిందే.

మహిళా సంఘాలకు వడ్డీ వాపస్

- జిల్లాకు రూ.16.57కోట్లు విడుదల

డొంకేశ్వర్(ఆర్మూర్): స్వయం సహాయక సంఘాలకు (ఎస్‌హెచ్‌జీ) ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. కాంగ్రెస్ సర్కారు చెప్పిన విధంగానే మహిళలకు వడ్డీలేని రుణాలను వర్తింపజేస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు మహిళలు కట్టిన వడ్డీ డబ్బులను తిరిగి వారికే చెల్లిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాకు బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి పథకాలకు సంబంధించి రూ.16.57కోట్లు విడుదల చేసింది. కాంగ్రెస్ అధికారంలో వచ్చిన నాటి నుంచి (డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి,మార్చి) నెలలకు సంబంధించిన వడ్డీని మహిళలకు ఇచ్చింది. జిల్లాకు విడుదలైన డబ్బులు 15,300 మహిళా సంఘాలకు చెందినవి కాగా, త్వరలోనే గ్రూపుల వారీగా వడ్డీ డబ్బులను వారి బ్యాంకు ఖాతాలో జమ చేయనున్నారు. ఇందుకోసం జిల్లా అధికారులు డేటాను సేకరించే పనిలో ఉన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2020 మార్చి వరకే ఎస్‌హెచ్‌జీ మహిళలకు వడ్డీని వాపస్ చేసింది. అప్పటి నుంచి 2023 వరకు రూ.140కోట్ల వడ్డీ రావాల్సి ఉంది.

ఏటీఎం ధ్వంసం.. రూ.20 లక్షలు చోరీ

- సీసీ కెమెరాలపై బ్లాక్ కలర్ స్ప్రే చేసిన దుండగులు
- 15 నిమిషాల్లోనే మిషన్ ధ్వంసం, దోపిడీ

రుద్రూర్: రుద్రూర్ మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో గల స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏటీఎంను దుండగులు ధ్వంసం చేసి రూ.20 లక్షల నగదు ఎత్తుకెళ్లారు. పక్కా ప్రణాళిక ప్రకారం జరిగిన చోరీకి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. బుధవారం రాత్రి 2 గంటల సమయంలో వాహనంలో వచ్చిన దుండగులు సమీపంలోని సీసీ కెమెరాలపై బ్లాక్ కలర్ స్ప్రే చేసి ఏటీఎం గదిలోకి చొరబడ్డారు. మిషన్‌ను ధ్వంసం చేసి రూ.20 లక్షల ఎత్తుకెళ్లారు. మిషన్ భాగాలను బయటపారవేశారు. దుండగులు తమ పనిని కేవ లం 15 నిమిషాల్లోనే పూర్తి చేసుకొని పరారయ్యా రు. రుద్రూర్–బోధన్ ప్రధాన రహదారిపై అర్ధరాత్రి వరకు వాహనాల రాకపోకలు కొనసాగడంతోపాటు పోలీసులు పెట్రోలింగ్ చేస్తుంటారు. ఏటీ ఎం మిషన్ గురించి పూర్తిగా తెలిసిన వారు దుండగుల్లో ఉండి ఉంటారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తెల్లవారుజామున వాకింగ్‌కు వెళ్తున్న వారు రోడ్డుపక్కన ఏటీఎం భాగాలు పడి ఉండడాన్ని గమనించి స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు శాఖ ఉన్నతాధికారులకు విషయాన్ని తెలిపారు. గురువారం ఉదయం బోధన్ ఏసీపీ శ్రీనివాస్, రుద్రూర్ సీఐ జయేశ్‌రెడ్డి, వర్ని ఎస్సై కృష్ణకుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. సమీపంలోని వ్యాపార సముదాయాల సీసీ కెమెరా ఫుటేజీలను సేకరించారు. క్లూస్ టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. బ్యాంకు అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దుండగుల కోసం గాలిస్తున్నారు.



దొంగలు ధ్వంసం చేసిన ఏటీఎం

పోలీసులు పట్టుకున్నారు.. ఏడీ వదిలేయమన్నాడు!

- మొరం క్వారీలో టిప్పర్లు, జేసీబీలు పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు
- ఆ క్వారీకి అన్ని అనుమతులు
- మాక్లూర్ ఠాణాలో స్వయంగా లెటర్ ఇచ్చిన మైన్స్ ఏడీ
- చర్చనీయాంశంగా ఏడీ తీరు

మాక్లూర్: అక్రమంగా మొరం తవ్వకాలు చేపడుతున్నారని టాస్క్‌ఫోర్స్ పోలీసులు క్వారీపై దాడి చేసి 21 టిప్పర్లు, రెండు జేసీబీలను పట్టుకున్నారు. అయితే ఆ క్వారీకి అన్ని అనుమతులు ఉన్నాయని, పట్టుకున్న వాహనాలను వదిలేయాలని మైన్స్ ఏడీ సత్యనారాయణ పోలీసులకు స్వయంగా లెటర్ ఇచ్చారు. ఈ వ్యవహారం మండలంలో చర్చనీయాంశంగా మారింది. మాక్లూర్ మండలం సింగంపల్లి శివారులో సర్వేనంబర్ 51/2 లో 2.60 హెక్టార్లలో అనుమతి ఉన్న మొరం క్వారీపై ఈ నెల 13న టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. పట్టుకున్న వాహనాలను మాక్లూర్ పోలీసులకు అప్పగించారు. అయితే గురువారం ఉదయం మైన్స్ ఏడీ సత్యనారాయణ అన్ని అనుమతులు ఉన్నాయని మాక్లూర్ పోలీసుల వద్దకు స్వయంగా వెళ్లి లెటర్ ఇవ్వడం గమనార్హం. పట్టుకున్న టిప్పర్లు, జేసీబీలను వదిలిపెట్టే విషయమై గురువారం సాయంత్రం వరకు యజమానులతో మంతనాలు జరిపారు. దీనిపై ఎస్సై సుధీర్‌రావును వివరణ కోరగా వాహనాలను వదిలే విషయమై ఇంకా ఏ నిర్ణయం తీసుకోలేదని చెప్పారు. మైన్స్ ఏడీ సత్యనారాయణ అన్ని అనుమతులు ఉన్నాయని చెబుతున్నప్పుడు టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఎందుకు పట్టుకున్నట్టు అనే చర్చ జరుగుతోంది.



సింగంపల్లి శివారులోని మొరం క్వారీ

పరారీలో క్వారీ యజమాని

సింగంపల్లి శివారులో ఉన్న క్వారీ అనుమతి పుప్పాల గంగాధర్ పేరు ఉండగా నిర్వహణ బాధ్యత ఓ మాజీ ప్రజాప్రతినిధి సమీప బంధువు చూస్తున్నారు. కాగా గతంలో కూడా ఈ క్వారీలో నిబంధనలను అతిక్రమించి తవ్వకాలు చేపడుతున్నారనే ఫిర్యాదులు రావడంతో 2023 డిసెంబర్‌లో పోలీసులు, మైన్స్ ఏడీ సత్యనారాయణ తనిఖీ చేశారు. అప్పుడు పెద్ద ఎత్తున పేలుడు పదార్థాలు లభించాయి. అంతేగాకుండా నిబంధనలను అతిక్రమించి తవ్వకాలు జరిగాయని విచారణలో తేలింది. దీంతో పోలీసులు గంగాధర్‌పై కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి గంగాధర్ చిన్నాపూర్‌లోని తన ఇంటికి తాళం వేసి భార్య పిల్లలతో పరారయ్యాడు. ఇప్పటి వరకు ఆయన ఆచూకీ లేదు. అయినా క్వారీ మాత్రం కొనసాగుతోంది. ఈ క్వారీ లీజు గడువు 2027 సెప్టెంబర్ 2 వరకు ఉంది. నిబంధనలు అతిక్రమించడంతో అప్పట్లోనే క్వారీ లీజును రద్దు చేయాల్సి ఉండగా అదేమి జరగలేదు. రాజకీయ పలుకుబడి ఉన్న కొందరు అధికారుల అండదండలతో నిబంధనలను అతిక్రమించి మొరం తవ్వకాలు చేపడుతున్నారు. ఈ విషయమై మైన్స్ ఏడీ సత్యనారాయణను వివరణ కోరగా లీజుదారుడు గంగాధర్‌పై కేసు నమోదు విషయం తనకు తెలియదన్నారు. ఆయనకు కేటాయించిన వెబ్‌సైట్‌లో లాగినై ప్రభుత్వానికి పన్నులను చెల్లిస్తుండటంతో అన్ని విధాలుగా అనుమతులు ఉన్నట్లేనని తెలిపారు.

నర్సరీల నిర్వహణ గాలికి!

- బ్యాగుల్లో మొలకెత్తని విత్తనాలు
- సగానికిపైగా నర్సరీల్లో ఇదే పరిస్థితి
- మళ్లీ విత్తనాలు వేసిన అధికారులు
- షేడ్ నెట్లు లేక ఎండుతున్న మొక్కలు

డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లాలో హరితహారం నర్సరీలను అధికారులు గాలికొదిలేశారు. వాటి నిర్వహణపై పెద్దగా దృష్టి పెట్టడం లేదు. దీంతో ఈ ఏడాది నర్సరీల్లో పెంచుతున్న మొక్కల్లో ఎదుగుదల లోపించింది. విత్తనాల లోపం కారణంగా చాలచోట్ల బ్యాగుల్లో మొలకలు రాలేదు. జిల్లాలో సగానికి పైగా నర్సరీల్లో ఇదే పరిస్థితి నెలకొంది. విత్తనాలు మొలకెత్తని చోట ఇటీవల మళ్లీ సీడ్ వేశారు. పంచాయతీ కార్యదర్శుల నిర్లక్ష్యం, ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపమే ఇందుకు కారణమని తెలుస్తోంది. హరితహారం కోసం జిల్లాలో పంచాయతీకో నర్సరీని ఏర్పాటు చేసి మొక్కలను పెంచుతున్నారు. గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఈ నర్సరీలు కొనసాగుతుండగా, పంచాయతీ కార్యదర్శులకే నిర్వహణ బాధ్యత అప్పగించారు. ఈ ఏడాది గ్రామీణాభివృద్ధి శాఖ ప్రతీ గ్రామ పంచాయతీకి పదివేల చొప్పున మొక్కలను నర్సరీల్లో పెంచుతోంది. జిల్లావ్యాప్తంగా 530 జీపీలు కలిపి 53 లక్షల మొక్కలను పెంచుతున్నారు. ఇందుకోసం గతేడాది డిసెంబర్‌లోనే నర్సరీలను సిద్ధం చేశారు. అయితే పలు నర్సరీల్లో మూడు నెలలైనా జర్మినేషన్ (మొలకలు) రాలేదు. దీంతో మళ్లీ విత్తనాలు, స్టంప్స్‌ను కొనుగోలు చేసి పాలిథిన్ బ్యాగుల్లో వేశారు.



కోమట్‌పల్లి నర్సరీలో పాలిథిన్ బ్యాగుల్లో మొలకలు రాని దృశ్యం

మొక్కలకు నీడ కరువు

నర్సరీల్లో పెరుగుతున్న మొక్కలకు రక్షణ కరువైంది. ప్రస్తుతం ఎండలు మండుతున్నాయి. వేడికి మొక్కలు ఎండుతున్నాయి. మొక్కలకు రక్షణగా షేడ్ నెట్లు ఏర్పాటు చేయాల్సి ఉండగా చాలా నర్సరీల్లో అవి కనిపించడం లేదు. షేడ్ నెట్ల ద్వారా మొక్కలకు అవసరమైన ఉష్ణోగ్రత లభించి సక్రమంగా ఎదుగుతాయి. ఈ నెట్లను గతంలో గ్రామీణాభివృద్ధి శాఖ టెండర్ల ద్వారా జీపీలకు సరఫరా చేసేది. పంచాయతీలకే గ్రీన్ బడ్జెట్ ఇవ్వడంతో ఇవ్వడం మానేశారు. జీపీ కార్యదర్శులు షేడ్ నెట్లను కొనుగోలు చేసి ఏర్పాటు చేయాల్సి ఉండగా కొన్ని నర్సరీల్లోనే కనిపిస్తున్నాయి. రికార్డుల్లో మాత్రం షేడ్ నెట్లు ఏర్పాటు చేసినట్లు నమోదు చేసి బిల్లులు లేపుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నర్సరీల పరిస్థితిపై సమీక్షిస్తాం

జిల్లావ్యాప్తంగా గ్రామ పంచాయతీల్లో ఉన్న నర్సరీల నిర్వహణపై సమీక్షించి పరిస్థితిని తెలుసుకుంటాం. కొన్ని నర్సరీల్లో విత్తనాలు మొలకెత్తలేదని మాకు సమాచారం ఉంది. అలాంటి చోట్ల కొత్త విత్తనాలు వేయించాం. ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో మొక్కలను కాపాడేందుకు షేడ్ నెట్లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటాం.
– సాయాగౌడ్, డీఆర్‌డీవో, నిజామాబాద్

భూగర్భ, గనుల శాఖ డీడీగా మధుసూదన్‌రెడ్డి

- ఏడీ సత్యనారాయణ బదిలీ

సుభాష్‌నగర్: జిల్లా భూగర్భ, గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా మధుసూదన్‌రెడ్డి వరంగల్ నుంచి జిల్లాకు బదిలీపై వస్తున్నారు. ఈ మేరకు ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ గురువారం ఆదేశాలు జారీ చేశారు. అలాగే ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఏడీ సత్యనారాయణ వికారాబాద్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో జగిత్యాల నుంచి విజయ్ కుమార్ రాథోడ్ వస్తున్నారు. రాయల్టీ ఇన్‌స్పెక్టర్‌గా మధుసూదన్ వరంగల్ రూరల్, రమేష్ సంగారెడ్డి నుంచి వస్తున్నారు. జిల్లా నుంచి ఆంజనేయులు కరీంనగర్‌కు, రాయిసుద్దీన్ మహబూబాబాద్‌కు బదిలీ అయ్యారు.

పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీలు

- వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్ శాంతికుమారి

సుభాష్‌నగర్: అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు ఏర్పాటు చేసి, బడుల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించిందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తెలిపారు. గురువారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతి కుమారి, రాష్ట్రస్థాయి ఉన్నత అధికారులతో కలిసి అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఏర్పాటుపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మహిళా శక్తి కార్యక్రమంలోభాగంగా రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ బాధ్యతలను స్వశక్తి మహిళా సంఘాలకు అప్పగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. పాఠశాలలకు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను సత్వరమే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్ అంకిత్, డీఈవో దుర్గాప్రసాద్, డీఆర్‌డీవో సాయాగౌడ్, సీపీవో బాబురావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రమేష్, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ అధికారులు శశికళ, నాగోరావు తదితరులు పాల్గొన్నారు.



క్లుప్తంగా

ఆలయాల హుండీ లెక్కింపు



నిజామాబాద్ సిటీ: నగరంలోని నీలకంఠేశ్వర, జెండా బాలాజీ ఆలయాల హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు. దేవాదాయ, ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ ఎస్ సుప్రియ సమక్షంలో హుండీలను తెరిచారు. రథసప్తమి, మహాశివరాత్రి పర్వదినాల నేపథ్యంలో నీలకంఠేశ్వర ఆలయానికి రూ.3,37,346 నగదు ఆదాయం సమకూరినట్లు సహాయ కమిషనర్ తెలిపారు.

అలాగే రెండు నెలలకు సంబంధించి జెండా బాలజీ ఆలయ హుండీ ఆదాయం రూ.60,250 వచ్చిందన్నారు. ఈవో వేణు, జెండా బాలాజీ ఆలయ చైర్మన్ జాలిగం గోపాల్, ధర్మకర్తలు రాముగౌడ్, నర్సింగ్ రావు, నాగభూషణ్, సంతోష్, ఆలయ అర్చకుడు నాగరాజు, జూనియర్ అసిస్టెంట్ ఆంజనేయులు, ఆలయ విష్ణు సహస్రనామ పారాయణ భక్తులు తదితరులు పాల్గొన్నారు.

సైనిక్ స్కూల్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



సాన్విరెడ్డి



పూర్ణచందర్

నిజామాబాద్అర్బన్: ఆలిండియా సైనిక్ స్కూల్ ఆరో తరగతి ప్రవేశానికి సంబంధించి నిర్వహించిన పరీక్షల్లో జిల్లా విద్యార్థులు ప్రతిభ చాటారు. జిల్లాకు చెందిన వర్షిత్ వర్మ 300 మార్కులకు 274, పూర్ణచందర్ 244, సాన్విరెడ్డి 274, మృణాల్‌రెడ్డి 233, విశ్వజిత్ 233, గంగాసహస్ర 220, ఆదం జనతన్ 215, శ్లోకా ప్రజ్వల్ 200 మార్కులు సాధించి ఆలిండియా ర్యాంకులు సాధించినట్లు ఐపై కోచింగ్ సెంటర్ డైరెక్టర్ రవివర్మ తెలిపారు. అనంతరం విద్యార్థులను అభినందించారు. ప్రతి ఏటా తమ కోచింగ్ సెంటర్ నుంచి వివిధ పోటీ పరీక్షల్లో ఎంతో మంది విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయి ర్యాంకులు సాధిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

చిరుతను పోలిన జంతువు సంచారం

- పాదముద్రల నమూనాలను సేకరించిన ఫారెస్ట్ అధికారులు



డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లా కేంద్రంలోని కంఠేశ్వర్ వాగు వద్ద చిరుతను పోలిన జంతువు సంచరిస్తున్నదన్న సమాచారం మేరకు ఫారెస్ట్ అధికారులు గురువారం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. నిజామాబాద్ నార్త్ రేంజ్ ఎఫ్ఆర్వో పద్మారావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కంఠేశ్వర్ ఎంఎస్ఆర్ కళాశాల ప్రాంతంలోని వాగుని ఆనుకుని చిరుతను పోలిన జంతువు స్థానికులకు కనిపించడంతో ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించారు.

నలుపు రంగులో ఉన్న జంతువు కాస్త ఎత్తుగా ప్రత్యక్షంగా చూసిన అధికారులకు తెలిపారు. ఘటనాస్థలానికి చేరుకున్న అధికారులు జంతువు పాదముద్రల నమూనాలను సేకరించారు. వాగుప్రాంతంలో సంచరిస్తున్న జంతువు నక్క లేదా తోడేలు అయి ఉండొచ్చని అనుమానిస్తున్నట్లు ఎఫ్ఆర్వో తెలిపారు. స్థానికులతోపాటు కళాశాల విద్యార్థులు ఆందోళన చెందొద్దని సూచించారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు

- చివరి రోజు పరీక్షకు 468మంది విద్యార్థుల గైర్హాజరు

నిజామాబాద్అర్బన్: ఇంటర్మీడియెట్ పరీక్షలు ముగిశాయి. చివరి రోజైన గురువారం గణాంక, రసాయన శాస్త్రం పరీక్షలు నిర్వహించారు. మొత్తం 15,698 మందికిగాను 15,230 మంది హాజరు కాగా, 468 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జిల్లా కేంద్రంలోని ఎస్ఆర్ జూనియర్ కళాశాల పరీక్షాకేంద్రాన్ని శిక్షణ ఐఏఎస్ అధికారిణి కిరణ్మయి తనిఖీ చేశారు. మొత్తం 57 పరీక్ష కేంద్రాలకుగాను ఇంటర్ బోర్డ్ స్క్వాడ్, జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ, ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్‌లు 51 సెంటర్లను తనిఖీ చేశారు. మొత్తం 36 మంది విద్యార్థులపై మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదయ్యాయని జిల్లా ఇంటర్ విద్యాధికారి రఘురాజ్ తెలిపారు. ఆరు సెంటర్లను ఆర్ఐవో తనిఖీ చేశారు. బ్రిడ్జి కోర్సు సబ్జెక్ట్‌లకు సంబంధించి రెండు పరీక్షలు నిర్వహించాల్సి ఉంది.



నగరంలో పరీక్షాకేంద్రాన్ని, తనిఖీ చేస్తున్న ట్రెయినీ ఐఎఎస్ అధికారిణి కిరణ్మయి

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

హమ్మయ్యా.. తమకు 'పరీక్ష' ముగిసిందని ఇంటర్ రెండో సంవత్సరం విద్యార్థులు ఊపిరి పీల్చుకున్నారు. ఈనెల 1వ తేదీన ప్రారంభమైన పరీక్షలు గురువారంతో ముగియడంతో వారి ఆనందానికి అవధుల్లేకుండాపోయాయి. ఎగ్జామినేషన్ సెంటర్లు, హాస్టళ్లు, కళాశాలల వద్ద కేరింతలు కొడుతూ సందడి చేశారు. తోటి విద్యార్థులతో ఉల్లాసంగా గడిపి సెల్ఫీలు తీసుకుంటూ, ఆటోగ్రాఫ్‌లు సేకరించారు. తమ పిల్లలను ఇంటికి తీసుకెళ్లేందుకు వచ్చిన తల్లిదండ్రులతో హాస్టళ్ల వద్ద సందడి నెలకొంది. విద్యార్థులు ఉత్సాహంగా ఇంటి దారిపట్టారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్





పరీక్ష కేంద్రం బయట విద్యార్థినుల సందడి



వైట్ షర్ట్‌పై ఆటోగ్రాఫ్ ఇస్తున్న స్నేహితులు..



సరదాగా ఓ సెల్ఫీ..

నేడు మోపాల్ సొసైటీ చైర్మన్ ఎన్నిక

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మోపాల్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (సొసైటీ) చైర్మన్ ఎన్నికను శుక్రవారం నిర్వహించనున్నారు. అసిస్టెంట్ రిజిస్ట్రార్ మురళి ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తారు. ఇప్పటికే 13 మంది డైరెక్టర్లకు ఎన్నికకు సంబంధించి నోటీసులు అందజేశారు. ఉదయం 9 నుంచి 11 గంటల వరకు నామినేషన్లు స్వీకరించిన అనంతరం స్క్రూటినీ, నామినేషన్ల ఉపసంహరణ ఉంటుంది. ఒకటికి మించి నామినేషన్లు దాఖలైతే మధ్యాహ్నం 2 గంటలకు ఎన్నిక నిర్వహిస్తారు.



మోపాల్ సొసైటీ కార్యాలయం

నాలుగేళ్లలో నాలుగో చైర్మన్..!

మోపాల్ సొసైటీకి నాలుగేళ్లలో నాలుగో చైర్మన్‌ను నేడు ఎన్నుకోనున్నారు. ప్రారంభంలో చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన దేశెపెద్ది కిశోర్‌రావు ఏడాది కాలం పాటుపని చేశారు. కరోనా సమయంలో ఆయన మృతిచెందగా, సుమారు ఏడాదిన్నర పాటు వైస్ చైర్మన్ సింగిడి చిన్నారెడ్డి ఇన్‌చార్జి చైర్మన్‌గా ఉన్నారు. ఆ తర్వాత రెగ్యులర్ చైర్మన్ కోసం నోటిఫికేషన్ వెలువడగా, న్యాల్‌కల్‌కు చెందిన ఉమాపతిరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఆయన రాజీనామా చేశారు. దీంతో చైర్మన్ ఎన్నిక అనివార్యమైంది.

ఎన్నిక ఏకగ్రీవమే..?

సొసైటీ చైర్మన్ పదవికి సింగిల్ నామినేషన్ దాఖలయ్యే అవకాశముంది. ముల్లంగి గ్రామానికి చెందిన గ్యానాజీ గంగారెడ్డికి స్థానిక ఎమ్మెల్యే అండదండలున్నాయి. ఇటీవల డైరెక్టర్లు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. దాదాపు 9 మంది డైరెక్టర్ల మద్దతుతో ఆయన చైర్మన్‌గా ఎన్నిక కానున్నట్లు సమాచారం.

మండల పరిషత్‌లో ఎమ్మెల్సీ పుట్టినరోజు వేడుకలు

- పోలీసులకు కాంగ్రెస్ నాయకుల ఫిర్యాదు

ఎడపల్లి(బోధన్): ఎమ్మెల్సీ కవిత జన్మదిన వేడుకలను మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించడంతో కాంగ్రెస్ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. టీఆర్ఎస్ నాయకులు మండల పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్సీ పుట్టినరోజు వేడుకలను నిర్వహించడంపై వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. బాధ్యులపై చర్యలు తీసుకోవలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పులి శ్రీనివాస్ పోలీసులను కోరారు. స్పందించిన ఎస్సై విక్రమ్ ఎంపీవో కార్యాలయంలో గురువారం విచారణ చేపట్టారు.

సర్టిఫికెట్ల వెరిఫికేషన్



నిజామాబాద్‌నాగారం: వైద్యారోగ్యశాఖ పరిధిలో అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ప్రాతిపదికన పోస్టులను భర్తీ చేయనున్న నేపథ్యంలో దరఖాస్తుదారుల సర్టిఫికెట్లను డీఎంహెచ్‌వో కార్యాలయంలో గురువారం వెరిఫై చేశారు. మెరిట్ ఆధారంగా రెండు, మూడు రోజుల్లో పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌వో సుదర్శనం తెలిపారు.

వ్యక్తి ప్రాణాలు కాపాడిన స్థానికులు

సిరికొండ: మండలంలోని పోత్నూర్ గుట్ట వద్ద చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తిని గ్రామస్తులు కాపాడారు. జక్రాన్‌పల్లి మండలం కొలిప్యాకకు చెందిన ఆడెపు అశోక్ మండలంలోని పోత్నూర్‌గుట్ట వద్ద గురువారం రెండు గంటలకుపైగా ఫోన్ మాట్లాడిన అనంతరం చెట్టుకు ఉరేసుకున్నాడు. సమీపంలో ఉన్న కాంగ్రెస్ నాయకుడు ప్రభాకర్‌రెడ్డి, వీడీసీ కార్యదర్శి వినోద్‌కుమార్, నర్సయ్య, సతీశ్, సాయినాథ్ గమనించి అక్కడికి చేరుకొని తాడును తొలగించి అశోక్ ప్రాణాలను కాపాడారు. అతడికి ప్రాథమిక చికిత్స అందించి పోలీసులకు అప్పగించారు. అశోక్ భార్యది పెద్దవాల్గోట్ కావడంతో ఇక్కడికి వచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు.

పిచ్చి కుక్క దాడిలో గాయాలు

బాల్కొండ: మండల కేంద్రానికి చెందిన గంజిగిరి మహేందర్‌పై గురువారం పిచ్చి కుక్క దాడి చేసి తీవ్రంగా గాయపర్చింది. బాధితుడిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా కుక్కకాటు మందు అందుబాటులో లేకపోవడంతో 108 అంబులెన్స్‌లో జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో గాయపడిన కానిస్టేబుల్ మృతి

ఖలీల్‌వాడి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన కానిస్టేబుల్ శంకర్ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఆర్మ్‌డ్ రిజర్వు విభాగంలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న శంకర్ ఈ నెల 12న ఆరోటౌన్ పీఎస్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. తలకు తీవ్ర గాయం కావడంతో జిల్లా ప్రభుత్వ వైద్యుల సూచన మేరకు కుటుంబీకులు హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. గురువారం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. డీసీపీ శంకర్‌నాయక్ కానిస్టేబుల్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. బాధిత కుటుంబాన్ని ఓదార్చారు. నివాళులు అర్పించిన వారిలో ఏసీపీ నాగయ్య, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ వెంకటి, ఆర్ ఎస్సై దత్తు, జిల్లా పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు షకీల్ పాషా, పోలీస్ సిబ్బంది ఉన్నారు.



నివాళులు అర్పిస్తున్న డీసీపీ శంకర్ నాయక్

రూ.లక్ష మాయం

వర్ని (చందూర్): స్నేహితుడు ఇచ్చిన రూ.లక్షను టిఫిన్ బ్యాగ్‌లో పెట్టి పక్కనే ఉన్న వారితో మాట్లాడుతుండగా బ్యాగ్‌తోపాటు రూ.లక్ష నగదు మాయమయ్యాయి. ఈ ఘటన చందూర్ మండల కేంద్రంలో గురువారం చోటు చేసుకుంది. వివరాలుఇలా ఉన్నాయి.. గోవూర్ హైస్కూల్ హెచ్ఎం మోతీలాల్‌కు చందూర్ బస్టాండ్‌లో ఓ స్నేహితుడు రూ.లక్ష నగదు ఇవ్వగా, అతడు టిఫిన్ బ్యాగ్‌లో పెట్టి పక్కనే ఉన్న బైక్ హ్యాండిల్‌కు తగిలించాడు. స్నేహితులతో మాట్లాడిన మోతీలాల్ పదినిమిషాల తరువాత చూడగా ద్విచక్రవాహనం కనిపించలేదు. తనబైక్ అనుకుని వేరే బైక్‌కు బ్యాగ్ వేయడం వల్లే ఈ ఘటన జరిగింది. బాధితుడు పోలీసు లకు ఫిర్యాదు చేసినప్పటికీ.. సీసీ ఫుటేజీ, సరైన ఆధారాలు లేకపోవడంతో వారు చేతులెత్తేసినట్లు తెలిసింది.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ శాసన సభాపక్ష నాయికుడు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

పెర్కిట్(ఆర్మూర్): బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఆ పార్టీ శాసన సభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని మామిడిపల్లిలో నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గస్థాయి కార్యకర్తల సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రధాని మోదీ దేశాన్ని ప్రపంచంలోనే బలమైన ఆర్థికశక్తిగా తీర్చిదిద్దుతున్నారన్నారు. పది సంవత్సరాలలో బీఆర్ఎస్ తెలంగాణను అప్పులపాలు చేయగా, అధికారం కోసం కాంగ్రెస్ వాగ్దానాలతో ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం డబ్బులతో రాష్ట్రంలో ఇళ్లు నిర్మిస్తూ వాటికి ఇందిరమ్మ పేరు పెడుతున్నారన్నారు. జగిత్యాల జిల్లాలో ఈ నెల 18న నిర్వహించనున్న ప్రధాని నరేంద్ర మోదీ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఎంపీ ధర్మపురి అర్వింద్ మాట్లాడుతూ.. మోదీ ప్రభావాన్ని తట్టుకోలేక లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ తరపున పోటీ చేసేందుకు అభ్యర్థులు ముందుకు రావడం లేదన్నారు. కాంగ్రెస్‌కు దేశవ్యాప్తంగా 30 ఎంపీ స్థానాలు వస్తే ఎక్కువ అని అన్నారు. మున్నూరుకాపు ఓట్లను చీల్చేందుకు ఎమ్మెల్సీ కవిత నిజామాబాద్ నుంచి బాజిరెడ్డి గోవర్ధన్‌ను బరిలోకి దించాలని ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. కానీ.. బీజేపీకి నాలుగింతల ఓటు బ్యాంకు పెరిగిందని, తట్టుకొని నిలబడే దమ్ము ఏ పార్టీకి లేదన్నారు. చెప్పిన విధంగానే పసుపు ధర క్వింటాల్‌కు రూ.20వేలకు చేరుకుందన్నారు. మోదీ పసుపు బోర్డు ప్రకటించిన ఇందూరులోనే బోర్డు కార్యాలయం ఏర్పాటు కానుందని పేర్కొన్నారు. మళ్లీ బీజేపీ ప్రభుత్వం రాగానే నాలుగు షుగర్ ఫ్యాక్టరీలను తెరిపిస్తామని నితిన్ గడ్కరీ వాగ్దానం చేసినట్లు తెలిపారు. సమావేశంలో పార్లమెంట్ ప్రభారీ వెంకటరమణి, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్య నారాయణగుప్తా, పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి, ప్రధాన కార్యదర్శి జీవీ నర్సింహారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పెద్దోళ్ల గంగారెడ్డి, భోగ శ్రావణి, మేడపాటి ప్రకాశ్‌రెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్లు ఏర్పాటు చేయాలి



ఆర్మూర్: జనాభా దామాషా ప్రకారం కార్పొరేషన్లు ఏర్పాటు చేయాలని 57 ఎస్సీ ఉప కులాల ఐక్య వేదిక నాయకులు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని కోరారు. హైదరాబాద్‌లో గురువారం ఆయనను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ప్రత్యేక కార్పొరేషన్ల ద్వారా ఉపకులాలను ఆదుకోవాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో నాయకులు కొక్కెర భూమన్న, బానాల మంగేశ్, ఎర్రుల యాదయ్య, ఉపాధ్యక్షుడు కడమంచి ఎల్లేశ్ తదితరులున్నారు.

ఇసుక డంప్ సీజ్



జక్రాన్‌పల్లి: మండలంలోని మనోహరాబాద్ గ్రామ శివారులో నిల్వ ఉంచిన ఇసుక డంపును మైన్స్, రెవెన్యూ అధికారులు గురువారం సీజ్ చేశారు. పక్కా సమాచారం మేరకు నిల్వ చేసిన 28 ట్రాక్టర్ల ఇసుకను సీజ్ చేసినట్లు మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ తెలిపారు. ఇసుక నిల్వ ఉంచిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

కామారెడ్డిలో రూ. 20 లక్షల అల్ప్రాజోలం పట్టివేత

- ఒకరి అరెస్టు, మరొకరు పరార్

కామారెడ్డి క్రైం: కారులో తరలిస్తున్న రూ.20 లక్షల విలువైన అల్ప్రాజోలంను ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. నిజామాబాద్ డివిజన్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కామారెడ్డిలోని ఇంటర్నేషనల్ హోటల్ ప్రాంతంలో ప్రధానరోడ్డుపై వాహనాలను ఎక్సైజ్ పోలీసులు తనిఖీ చేస్తూ ఓ కారును ఆపారు. వెంటనే కారులోని ఓ వ్యక్తి కిందికి దిగి పారిపోగా, రాజస్థాన్ రాష్ట్రంలోని నాగౌర్ జిల్లా లాడ్ను గ్రామానికి చెందిన భవానీసింగ్ పట్టుబడ్డాడు. కారును తనిఖీ చేసి రెండు కిలోల అల్ప్రాజోలంను స్వాధీనం చేసుకున్నారు. భవానీసింగ్‌ను విచారించగా, రాజస్థాన్‌కు చెందిన ముఖేశ్‌సింగ్ నుంచి అల్ప్రాజోలం కొనుగోలు చేసి హైదరాబాద్‌లోని కూకట్‌పల్లికి చెందిన సుదర్శన్‌కు విక్రయించినట్లు తెలిపాడు. దీంతో పారిపోయిన వ్యక్తి సుదర్శన్‌గా పోలీసులు నిర్ధారించారు. పట్టుబడ్డ వ్యక్తిపై మాదకద్రవ్యాల నియంత్రణ చట్టం కింద కేసు నమోదు చేసినట్లు డిప్యూటీ కమిషనర్ తెలిపారు. కారును కామారెడ్డి ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించారు. దాడుల్లో సహాయ ఈఎస్ చంద్రభానునాయక్, సీఐలు స్వప్న, వెంకటేశ్, ఎస్సైలు విక్రం కుమార్, నర్సింహాచారి, సిబ్బంది పాల్గొన్నారు.



ఎక్సైజ్ అధికారుల అదుపులో నిందితుడు

భార్య పుట్టింటికి వెళ్లిందని ఆత్మహత్య

వర్ని: భార్య పుట్టింటికి వెళ్లిపోయిందని మనస్తాపంతో మండలంలోని జలాల్‌పూర్‌కు చెందిన షేక్ వహీద్(40) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై కృష్ణకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. భార్యాభర్తల మధ్య గొడవ కారణంగా వహీద్ భార్య రేష్మ బాన్సువాడలోని తన పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపానికి గురైన వహీద్ గురువారం సాయంత్రం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చెరువులో దూకి ఒకరు..

ఎడపల్లి: మండలంలోని మంగళ్‌పాడ్ గ్రామానికి చెందిన దేగాం లక్ష్మణ్ (50) చెరువులోదూకి ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కుటుంబ కలహాలకారణంగా మనస్తాపానికి గురైన లక్ష్మణ్ బుధవారం ఇంటనుంచి బయటకు వెళ్లాడు. గురువారం ఉదయం చెరువులో మృతదేహం కనిపించడంతో పోలీసులు బయటకు తీయించి పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య నర్సుబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు.



లక్ష్మణ్(ఫైల్)

మొరం టిప్పర్ల పట్టివేత

ఎడపల్లి: మండలంలోని బషీర్ ఫారం గ్రామ శివారులో అక్రమంగా మొరం తరలిస్తున్న టిప్పర్లు, జేసీబీలను పట్టుకున్నట్లు ఎస్సై విక్రం గురువారం తెలిపారు. అనుమతులు లేకుండా తవ్వకాలు చేపడుతున్నట్లు గుర్తించి వాహన యజమానులపై కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల ..

నాగిరెడ్డిపేట: మండలంలోని మాల్తుమ్మెద శివారులో ఉన్న మంజీరవాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను బుధవారం రాత్రి పట్టుకున్నట్లు ఎస్సై రాజు గురువారం తెలిపారు. ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో వెంటనే దాడి చేసి పట్టుకున్నట్లు పేర్కొన్నారు. వాహనాలను పీఎస్‌కు తరలించి యజమానులు, డ్రైవర్లపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.



పీఎస్‌లో ఉన్న ఇసుక ట్రాక్టర్లు

వేర్వేరు ఘటనల్లో ఆరుగురు మృతి

మాచారెడ్డి: పాల్వంచ మండలం ఎల్పుగొండ శివారులో క్రేన్ ఢీకొట్టిన ఘటనలో సగ్గిడి రాజయ్య (71) అనే వృద్ధుడు గురువారం మృతి చెందాడు. మాచారెడ్డి ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. చేపలువేటాడి జీవించే ఎల్పుగొండకు చెందిన రాజయ్య (71) పాల్వంచ మర్రి వద్దకు వెళ్లి ఎల్పుగొండకు నడుచుకుంటూ తిరిగి వస్తుండగా, వెనుక నుంచి వచ్చిన క్రేన్ ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

లారీని బైక్ ఢీకొని..

వేల్పూర్: మండలంలోని పడగల్ క్రాస్‌రోడ్డు సమీపంలో గురువారం సాయంత్రం లారీని వెనుక నుంచి బైక్ ఢీకొన్న ఘటనలో గొడికె రమేశ్(35) మృతి చెందినట్లు ఎస్సై వినయ్‌కుమార్ తెలిపారు. వివరాలు ఉన్నాయి.. పడగల్‌కు చెందిన రమేశ్ తన సోదరుడిని వేల్పూర్ క్రాస్‌రోడ్డు వద్ద దింపి, తిరిగి వస్తుండగా, ముందు వెళ్తున్న లారీని డ్రైవర్ ఆకస్మికంగా ఎడమవైపు తిప్పాడు. వెనకాలే ఉన్న రమేశ్ లారీని ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం అతడిని వెంటనే ఆర్మూర్‌కు తరలించగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. నిర్లక్ష్యంగా లారీని నడిపిన డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఈతకు వెళ్లి యువకుడు..

ఎడపల్లి: మండల కేంద్రానికి చెందిన గొర్రెల కాపరి నవీన్(22) స్నేహితులతో కలిసి మండలంలోని వడ్డాపల్లి గ్రామశివారులోని నిజాంసాగర్ డి–46 కాలువలో ఈతకు వెళ్లాడు. ఈత కొట్టే ప్రయత్నంలో నీటిప్రవాహానికి కొట్టుకుపోయాడు. వెంటనే అతడి స్నేహితులు పోలీసులకు సమాచారం అందించారు. నీటి విడుదలను నిలిపివేయించి నవీన్ ఆచూకీ కోసం పోలీసులు వెతకగా మృతదేహం లభ్యమైంది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అనుమానాస్పదస్థితిలో వివాహిత..

ఇందల్వాయి: మండలంలోని వెంగళ్‌పాడ్ గ్రామ పరిధిలోని పాటితండాలో కవిత(24) అనే వివాహిత గురువారం సాయంత్రం అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. మేఘ్యానాయక్ తండాకి చెందిన కవితకు పాటితండాకి చెందిన బాల్‌సింగ్‌తో పెళ్లికాగా, కొడుకు, కూతురు ఉన్నారు. కవిత మృతి చెందిన విషయం తెలుసుకున్న ఆమె బంధువులు ఆందోళనకు దిగడంతో సీఐ మల్లేశ్, ఎస్సై మనోజ్ పాటితండాకు చేరుకొని వివరాలు సేకరించారు.

విద్యుత్‌షాక్‌తో ఒకరు..

డిచ్‌పల్లి: మండలంలోని ధర్మారం(బి)లో గురువారం విద్యుత్ స్తంభం ఎక్కి పని చేస్తుండగా విద్యుత్‌షాక్ తగిలి షేక్ అంజాద్ (35) మృతి చెందినట్లు డిచ్‌పల్లి ఎస్సై యూ మహేశ్ తెలిపారు. నిజామాబాద్‌లోని ఇంద్రాపూర్ కాలనీకి చెందిన అంజాద్ ధర్మారంలో విద్యుత్ స్తంభం ఎక్కి మరమ్మతులు చేస్తుండగా, షాక్ తగిలి కింద పడిపోయాడు.అంజాద్‌ను చికిత్స నిమిత్తం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని..

ఖలీల్‌వాడి : నగరంలోని అర్సపల్లి రైల్వేట్రాక్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని రాజు(30) అనే వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై రమేశ్ తెలిపారు. బోధన్ రోడ్డు నుంచి అర్సపల్లిలోని ఇంటికి వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొని రాజు మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

కులంపేరుతో దూషించినఎనిమిది మందికి జైలుశిక్ష

ఖలీల్‌వాడి: వ్యక్తిని కులం పేరుతో దూషించి గాయపర్చిన ఎనిమిది మందికి ఒక్కొకక్కరికి సంవత్సరం జైలుశిక్ష విధిస్తూ నిజామాబాద్ షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల అత్యాచారాల నిరోధక విచారణ న్యాయస్థానం స్పెషల్ జడ్జి టి.శ్రీనివాస్ గురువారం తీర్పు వెలువరించారు. ఏపీపీ బంటు వసంత్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మాక్లూర్ మండలం మదనపల్లికి చెందిన బోపతి ప్రభాకర్ 2020 జనవరి 26 వరకు వీడీసీ కోశాధికారిగా పని చేశాడు. ఆలయానికి విరాళం విషయంలో గ్రామానికి చెందిన ఒడ్డెన్న ప్రభాకర్‌తో గొడవపడి కులంపేరుతో దూషించాడు. అనంతరం గోవూర్ రమేశ్, గోవూర్ చిన్నపోతన్న, దూంపతి సాయన్న, పురం సాయిలు, పురం ఒడ్డెన్న, పురం రవి, గోవూర్ రాజుతో కలిసి ప్రభాకర్‌పై దాడి చేశారు. నిందితులకు న్యాయమూర్తి శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు.

కోళ్లపందెం స్థావరంపై దాడి

- ఆరుగురి అరెస్ట్
- నగదు, తొమ్మిది కోళ్లు స్వాధీనం

రుద్రూర్ : మండలకేంద్రం శివారులోని గూండ్లవాగు సమీపంలో కొనసాగుతున్న కోళ్ల పందెం స్థావరంపై దాడి చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు సీఐ జయేశ్‌రెడ్డి తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు దాడి చేశామని, పట్టుబడిన వారి నుంచి రూ.4,760 నగదుతోపాటు 9 కోళ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ముగ్గురిపై కేసు నమోదు

మోపాల్(నిజామాబాద్‌రూరల్): బహిరంగ ప్రదేశంలో మద్యం సేవించిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గంగాధర్ గురువారం తెలిపారు. శుక్రవారం కోర్టులో హాజరుపరుస్తామన్నారు. అలాగే, వాహనాలను తనిఖీ చేసి నంబర్‌ప్లేట్లు లేని వాహనాలను ఆర్టీవో కార్యాలయానికి తరలించామన్నారు. మద్యం సేవించి వాహనలు నడిపితే చర్యలు తప్పవన్నారు.